క్లుప్తంగా

జేసీబీతో మట్టి తొలగింపు



మట్టిని తొలగిస్తున్న వీడీసీ సభ్యులు

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి వెళ్లే రహదారిపై వర్షం కారణంగా తారు రోడ్డు బురదమయంగా మారింది. మండల కేంద్రం నుంచి వడూర్ వరకు 4 కిలో మీటర్ల వరకు బురదతో ఉండడంతో వడూర్ వీడీసీ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో మట్టిని తొలగించారు. వర్షపు నీరు, మట్టి రాకుండా చర్యలు చేపట్టారు.

పస్కరాజుల పండుగ

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పస్క రాజుల పండుగను ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు. అనంతరం మేకలను బలిచ్చారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సదాశివ్, పట్టణ అధ్యక్షుడు సంతోష్, శంకర్, రాజేశ్వర్, నారాయణ, గణేష్, స్వామి, రాంబత్తుల రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వారసంత వేలం

బేల: మండల కేంద్రంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రతీ బుధవారం నిర్వహించే వారసంత వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.50 వేల డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

నేడు సొనాల తైబజార్ వేలం

బోథ్: సొనాల గ్రామ పంచాయతీ తైబజార్ వేలాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ.30వేల డిపాజిట్ చెల్లించి, వేలంలో పాల్గొనాలని కోరారు.

రాథోడ్ రమేశ్ మృతి తీరని లోటు

నేరడిగొండ: రాథోడ్ రమేశ్ బంజారా ముద్దుబిడ్డ అని, ఆయన మృతి తీరని లోటని నేరడిగొండ మండల లైవ్ కోఆర్డినేటర్ రాథోడ్ సందీప్ అన్నారు. ఆయన మరణానికి గుర్తింపుగా లైవ్ టీం ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల కోసం ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నామన్నారు. కార్యక్రమంలో గులాబ్ సింగ్, ప్రదీప్, సాయికుమార్, ప్రవీణ్, కల్యాణ్, సునంద్, తదితరులు పాల్గొన్నారు.

టీం ఇండియాకు మాజీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు

ఆదిలాబాద్‌టౌన్: టీ 20 వరల్డ్ కప్‌లో ఘన విజయం సాధించి విశ్వ విజేతగా నిలిచిన ఇండియా టీంకు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులు చూపిన స్ఫూర్తి అభినందనీయమని కొనియాడారు. సమిష్టిగా రాణిస్తే ఎంతటి విజయం సాధించవచ్చన్నారు.

దొరికిన బ్యాగ్ అప్పగింత



బ్యాగ్‌ను పోలీసులకు అప్పగిస్తున్న ఆటోయూనియన్ నాయకుడు

ఇచ్చోడ: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు మరిచిపోయిన బ్యాగ్‌ను ఆటో యూనియన్ నాయకులు స్థానిక పోలీసులకు అప్పగించి తమ ఉదారతను చాటుకున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన అబ్దుల్ తబ్రేజ్ అనే వ్యక్తి తన కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఆర్టీసీ బస్సులో నిర్మల్ నుంచి ఆదిలాబాద్‌కు ప్రయాణిస్తున్నారు. వారి బ్యాగ్ ఒక్కటి ఇచ్చోడలో మిస్సింగ్ కావడంతో స్థానిక ఆటో యూనియన్ వాళ్లు పీసీ 1231 అబ్దుల్ అహ్మద్‌కు అప్పగించారు. దీంతో పోలీసులు బ్యాగ్ పోగొట్టుకున్న వారిని గుర్తించి అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బోథ్: మండల కేంద్రంలోని భగత్‌సింగ్ చౌక్ వద్ద జూన్ 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని పట్నాపూర్ గ్రామానికి చెందిన కుమురం భూమన్న (78) గత నెల 23న ఆటోలో వెళ్తుండగా హెచ్‌పీ గ్యాస్‌కు చెందిన లారీ ఆటోను ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న భూమన్నకు తీవ్రగాయాలు కావడంతో ముందుగా బోథ్, అక్కడి నుంచి ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 28న మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల్లో 'సాయినగర్'



ఇంటి పక్కనే ఉన్న పిచ్చిమొక్కలు

- ఏళ్లుగా అభివృద్ధికి దూరం
- ఇళ్ల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు
- కానరాని డ్రెయినేజీ, సీసీరోడ్డు
- వానొస్తే ఇళ్లల్లోకి వరద

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కాలనీలో సమస్యలు తిష్టవేసినా.. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తిచూడడం లేదు. కాలనీ ఏర్పడి 20 ఏళ్లు అవుతున్నా.. డ్రెయినేజీలు, సీసీరోడ్లు కరువయ్యాయి. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక వర్షాకాలంలో వరద నీరు కాలనీని ముంచెత్తుతోంది. సాయినగర్లో సుమారు 250 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. దాదాపు వెయ్యికి పైగా జనాభా ఉంది. కాలనీలో కనీస వసతులు లేవు. రేషన్ దుకాణం లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి రావాల్సి వస్తోంది. వైకుంఠధామం లేకపోవడంతో దాదాపు మూడు కిలో మీటర్ల మేర దూరంలో ఉన్న బోథ్‌లోని వైకుంఠధామంలో దహన సంస్కారాలు చేయాల్సిన పరిస్థితి.

ఇళ్లలోకి విషసర్పాలు..

కాలనీలో ఇళ్ల చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగిపోవడంతో విషపు సర్పాలు ఇళ్లల్లోకి వస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. విషపు సర్పాలకు పిచ్చి మొక్కల పొదలు ఆవాసాలుగా మారుతున్నాయి. గత నాలుగు రోజుల క్రితం ఒకే దగ్గర ఐదు పాములను కాలనీవాసులు చంపివేశారు. పాముల బెడదతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు పిచ్చి మొక్కలు, పొదలను తొలగించాలని కోరుతున్నారు.



ఇటీవల కూలిన లోలెవల్ వంతెన

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ..

కాలనీలో ఎటుచూసినా అస్తవ్యవస్థమైన డ్రెయినేజీ వ్యవస్థ, మట్టి రోడ్లు స్వాగతం పలుకుతున్నాయి. మురికి కాల్వలు లేకపోవడంతో మురుగు రోడ్లపైనే పారుతుంది. దోమలు, ఈగల వల్ల రోగాల బారిన పడాల్సివస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్లు లేకపోవడంతో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయని వాపోతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు బురదరోడ్లపై నడవలేని పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొంటున్నారు.

వర్షం పడితే భయం.. భయంగా..

వర్షాకాలంలో భయం భయంగా జీవనం సాగిస్తున్నారు. చిన్నపాటి వర్షాలకే సాయినగర్ వరదలతో నీట మునుగుతోంది. రోడ్లపైన వరద ప్రవాహం ఉండి, ఇళ్లల్లోకి వరదనీరు చేరుతుంది. పక్కా డ్రెయినేజీ, వరద కాలువలు లేకపోవడంతో అస్తవ్యస్తంగా ప్రవహిస్తోంది. గత ఏడాది కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీరు చేరి నిత్యావసర సామగ్రి తడిచిపోయాయి. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలనీలో వరద సమస్య, మురికికాలువల నిర్మాణం చేపట్టేందుకు ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు మంజూరు కాలేదు.

పాములు వస్తున్నాయి



కాలనీలో ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు పెరిగాయి. వీటి వల్ల విష పురుగులు, పాములు ఇళ్లలోకి వస్తున్నాయి. రోడ్డు, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. వర్షానికి బురదమయంగా మారుతున్నాయి. పిచ్చిమొక్కలను తొలగించాలని, రోడ్లు వేయాలి.

– భారతాల శైలేందర్

ఎవరూ పట్టించుకోవడం లేదు



సాయినగర్ కాలనీని ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. కాలనీ ఏర్పడి 20 ఏళ్లు గడిచింది. 20 ఏళ్లలో కాలనీలో ఎలాంటి అభివృద్ధి చేయలేదు. డ్రెయినేజీలు, సీసీరోడ్లు, వరద కాలువ నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.

– జక్కుల వెంకటేశ్

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నాయకులను సన్మానిస్తున్న అధికారి శంకర్

బేల: ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల ప్రత్యేకాధికారి శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ ఠాక్రే వనిత గంభీర్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ఐకేపీ ఏపీఎం రాజారెడ్డి మాట్లాడుతూ.. మండలానికి రెండు మీ సేవకేంద్రాలు మంజూరయ్యాయని, మహిళ శక్తి సంఘాల సభ్యులతో ఏర్పాటు చేయిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు 90 శాతం యూనిఫారంలు అందించామన్నారు. రైతుల సౌకర్యార్థం వ్యవసాయ పనిముట్లను కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను పద్మావతి మండల సమైఖ్య ఆధ్వర్యంలో మండలకేంద్రంలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. చివరగా ఈనెల 4న జెడ్పీటీసీ అక్షిత సతీష్‌పవార్, ఎంపీపీ, ఎంపీటీసీలు, మండల కోఆప్షన్‌సభ్యుడు తన్వీర్ ఖాన్‌ల పదవీకాలం ముగుస్తుండడంతో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్‌కుమార్, ఎంపీవో మహేశ్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గీత, అటవీశాఖ బీట్ అధికారి కలేందర్, తదితరులు పాల్గొన్నారు.

తుప్పు పడుతున్న మంచాలు



పాఠశాల ఆవరణలో మంచాలు

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో చదివే గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా.. అధికారుల నిర్లక్ష్యంతో అవి దరి చేరడం లేదు. ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు గత ఐదేళ్ల క్రితం డెస్కులతో పాటు మంచాలను పంపిణీ చేశారు. అయితే కొన్ని పాఠశాలలో సరిపడ గదులు లేక ఆరుబయటే పెట్టడంతో వర్షానికి తడిసి తుప్పుపడుతున్నాయి. అయినా.. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఒక్క ఉన్నత ఆశయంతో ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి సౌకర్యాలు సమకూర్చితే ఇలా వృథా చేయడం సరికాదని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి ఆరుబయట ఉన్న మంచాలను తప్పుపట్టకుండా చూడాలని కోరుతున్నారు.

లైవ్ ఎంప్లాయీస్ కోఆర్డినేటర్‌గా కైలాస్



రాథోడ్ కైలాస్

ఇచ్చోడ: గిరిజన లంబాడాల ఐక్యవేదిక (లైవ్) ఎంప్లాయీస్ బోథ్ అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా రాథోడ్ కైలాస్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ తెలిపారు. రాథోడ్ కైలాస్ మాట్లాడుతూ.. నమ్మకంతో పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో లంబాడాల ఐక్యత కోసం తన వంతుగా కృషి చేస్తానని అన్నారు.

ముమ్మరంగా గొల్లఘాట్ రోడ్డు పనులు



పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులు

తాంసి: భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ గ్రామ మట్టి రోడ్డు మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గొల్లఘాట్ గ్రామానికి ఉన్న ఏకైక మట్టి రోడ్డు వర్షాలతో పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో రోడ్డు సౌకర్యం కల్పించాలని అధికారులకు గ్రామస్తులు విన్నవించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి గొల్లఘాట్ రోడ్డు మరమ్మతుల కోసం రూ.5 లక్షలు నిధులు మంజూరు చేశారు. సంబంధిత నిధులతో అధికారులు రోడ్డు పనులు ప్రారంభించారు. పనులను పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. రోడ్డు పనులు చేపట్టడంతో ప్రయాణ కష్టాలు దూరమవుతాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాలిటెక్నిక్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వీరస్వామి



ఉద్యోగ విరమణ పొందిన భరద్వాజ దంపతులను సన్మానిస్తున్న లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వీరస్వామి నియామకయ్యారు. ఇదివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన పి.భరద్వాజ ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన భరద్వాజను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. గత 36 సంవత్సరాలుగా పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. 1988లో అసోసియేట్ లెక్చరర్‌గా ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో చేరారు. సన్మాన కార్యక్రమంలో లెక్చరర్లు రాజ్‌కుమార్, రాజన్న, సుజయ్, జ్యోత్స్న రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న రవికిరణ్ యాదవ్

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని డాక్టర్ రవికిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వైకుంఠట్రస్ట్‌లో మూడు నెలల పాటు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి బాసటగా నిలవాలని కోరారు. తమ ట్రస్ట్ ద్వారా టైలరింగ్, మగ్గం, ఎంబ్రాయిడరీ అంశాల్లో ఉచిత శిక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చిక్కాల రవి కిరణ్, మహేందర్, రామన్న, రమేశ్, స్వప్నిల్, సత్యనారాయణ, శ్రావణి, పూజ, వీణా, ప్రవళిక పాల్గొన్నారు.

చిన్నారులను పాఠశాలకు పంపించాలి



అవగాహన కల్పిస్తున్న సంస్థ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: చిన్నారులను తప్పకుండా పాఠశాలకు పంపించాలని న్యూ రెయిన్‌బో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కొమ్ము రాము అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన తిప్ప గ్రామపంచాయతీ పరిధిలోని బోరింగ్‌గూడలో ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేటీ బచావో బేటీ పడావో పథకం గురించి వివరించడంతో పాటు మహిళలు స్వయం ఉపాధిపై శిక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిషన్, ఆశ వర్కర్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భగవాండ్లు, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దొంగలకు దేహశుద్ధి

జైనథ్: మండలంలోని తరోడ- ఖఖబి శ్రీకృష్ణ ఆలయంలో ఆదివారం వేకువజామున దొంగలు పడ్డారు. దొంగలు ఆలయం తలుపులు తెరుచుకొని లోపలకు ప్రవేశించగా, దొంగల అలజడికి స్థానికులు కొంతమంది ఆలయం వద్దకు చేరుకున్నారు. గ్రామస్తులు ఒకరికొకరు ఫోన్లు చేసుకొని, ఆలయం వద్ద చేరుకొని దొంగలను చాకచక్యంగా పట్టుకున్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన షేక్ అయాన్, షేక్ సమీర్‌లను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఆలయంలోని శ్రీకృష్ణుని కిరీటం, ఇతర ఆభరణాలు, కడియాలు, హుండీలను దొంగలించేందుకు ప్రయత్నించగా.. గ్రామస్తులు వారిని ఎదిరించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

అన్నదాత కోరినట్లుగానే రైతు భరోసా

- జిల్లా సహకార అధికారి మోహన్



మాట్లాడుతున్న మోహన్



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి పులయ్య

నేరడిగొండ: అన్నదాత అభిప్రాయాలకు అనుగుణంగా ప్రభుత్వం రైతు భరోసా అందించేందుకు ఏర్పాట్లు చేస్తుందని జిల్లా సహకార సంఘం అధికారి మోహన్ అన్నారు. రైతుల అభిప్రాయ సేకరణలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పథకానికి సంబంధించి రైతుల అభిప్రాయాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు. దీనిపై చర్చించి విధివిధానాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. వివిధ గ్రామాల రైతులు, పలువురు డైరెక్టర్లు తమ అభిప్రాయాలు తెలుపగా, తీర్మానం తయారు చేసి పంపించారు. ఇందులో పీఏసీఎస్ అధ్యక్షుడు సాబ్లే కిశోర్ సింగ్, ఆడిటర్ సూపరింటెండెంట్ ముజాఫర్ హుస్సేన్, సహకార సంఘం ఉపాధ్యక్షుడు వెంకటరమణ, డైరెక్టర్లు సంజీవ్, బన్సీ, గోపీచంద్, సీఈఓ నాగభూషణం, ఏఈవో సౌజన్య పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చేపట్టనున్న రైతుభరోసా పథకంలో అర్హులను గుర్తించాలని జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డీసీవో మోహన్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక మహాజన సభ, రైతుబంధు, రైతు భరోసాపై అవగాహన కల్పించారు. రైతులు, ప్రజాప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు సేకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య, పాక్స్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్, డైరెక్టర్లు సత్యనారాయణ, మేకల లింగన్న, వినిల్, గవ్వల రాజు, సీఈవో నారాయణగౌడ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: తెలంగాణ ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న రైతుభరోసా పథకం అమలు కోసం రైతుల నుంచి నేరుగా సలహాలు స్వీకరిస్తున్నట్లు డీసీవో మోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని ముఖరా(బి)లో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం రైతుభరోసా కింద ఎకరానికి రూ. 15 వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. దీని కోసం ఎన్ని ఎకరాల రైతులు పథకం వర్తింప చేయాలన్న విషయంపై రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సహకార చైర్మన్ సురేశ్, మాజీ సర్పంచ్ అడప్ మారుతి, రైతులు పాల్గొన్నారు.

రైతుభరోసాపై మహాజన సభ

తాంసి: మండలంలోని జామిడి గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతుభరోసాపై ఆదివారం ప్రత్యేక మహాజన సభ నిర్వహించారు. గ్రామంలోని వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతుభరోసా కార్యక్రమంపై సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక రైతుకు రైతుభరోసా పథకం ద్వారా సాయం అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈవో రాంరెడ్డి, కార్యదర్శి కార్తీక్, రైతులు వినోద్ రెడ్డి, రామన్న, కేశవ్‌రెడ్డి పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..

ఇంద్రవెల్లి: మండలంలోని మారుమూల గ్రామాల రోడ్లు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని ముచ్చపూర్, పొల్లుగూడ, ఖైర్‌గూడ, గోపాల్‌పూర్, మామిడిగూడ, చిత్తబట్ట, అంద్‌గూడ, హీరాపూర్, భగత్‌సింగ్‌నగర్ గ్రామాల రోడ్లు చిత్తడిగా మారడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి చిత్తడిగా మారిన రోడ్లపై మొరం పోసి మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చిత్తడిగూడ మారిన ముచ్చపూర్ రోడ్డు

నేటి నుంచి కొత్త చట్టాలు అమలు

ఆదిలాబాద్‌టౌన్: బ్రిటీష్ కాలం నాటి ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఈఏ చట్టాలు కాలగర్భంలో కలిసిపోయినట్లేనని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. జూలై 1 నుంచి కొత్త చట్టాలు అమలులోకి రానున్నట్లు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష, భారతీయ సాక్ష అధియాన్ కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. 150 ఏళ్ల క్రితం ఈ చట్టాలను రూపొందించడం జరిగిందని, మారిన కాలానుగుణంగా కొత్త చట్టాలు అమలులోకి రావడం జరిగిందని పేర్కొన్నారు. గత సైబర్ క్రైం, ఇతర నేరాలకు సంబంధించి చట్టాలు ఉండేవి కాదని, ప్రస్తుతం పెరిగిన టెక్నాలజీకి అనుగుణంగా నూతన చట్టాలు అమల్లోకి వస్తాయన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్, తదితర చట్టాలు ఉన్నాయని, కొత్త చట్టాలు కఠినంగా అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరు నూతన చట్టాలకు లోబడి నడుచుకోవాలని డీఎస్పీ సూచించారు.